# కౌటిక కంటినీరు

"నువ్వు ఎక్కవలసిన రైలు ఎప్పుడూ ఒక జీవితకాలం లేటు"......

విజయవాడ బస్‌స్టాండ్‌లో బందరు బస్‌కోసం నానాయాతనా పడుతూంటే పైమాట గుర్తొచ్చింది. పక్కనున్న బందరుకే టికెట్ దొరకడం కష్టం అయి—దొరికింది! అనుకునేసరికి మధ్యాహ్నం అయింది. చుట్టూ చూస్తుంటే మూడువంతుల మొహాల మీద నిస్పృహ, అతృత, చిరాకు రాగం తానం పల్లవీ కలుపుతున్నాయి.

"చూడు బాబూ—నా జేబులో పర్స్ యెలా పోయిందో తెలియదు. ఉయ్యూరు వెళ్ళాలి. ఏమనుకోక నాకు టికెట్ తీసిపెట్టగలవా? అంతవరకూ ... ..."

నన్ను ప్రశ్నించినవైపు తిరిగాను.

తల పండింది. వయసుకన్నా, బాధల ప్రభావం శరీరాన్ని లొంగ తీసుకున్నట్టుగా వుంది. మామూలు పంచె, ఖద్దరులాల్చీ, అవయవాల అలసటని కొంతలో కొంతకప్పిపుచ్చుతున్నాయి. చేతిలో వేంకట్రామా అండ్ కో వారి సంచీ. ఆ శరీరం మీదనుంచి పదేళ్ళు తొలగిస్తే; కాదు! నా జ్ఞాపకాన్నే అన్ని సంవత్సరాలు వెనక్కి నెట్టగల్గితే—ఇలాంటి మనిషిని చూసి వుంటానన్న ఊహ, చుక్కలా మెదుల్తూ మెదడంతా కుదుపుతోంది.

"అక్కడ దిగ్గానే బస్ స్టాప్‌లో ఎవర్నయినా అడిగి ఇస్తాబాబూ..."

ఇటువంటి తాత్కాలిక ఆపదలు అసహజం కాకపోయినా—చాలా మందికి యిలా అవసరాలు గడుపుకుందుకు ఒక ఎత్తుగా మారుతున్న యీ రోజుల్లో అనుమానం కలగడం సహజం. ఆయనవైపు చూస్తే, తిరిగి గుర్తుచేసుకోలేని నా మెదడు వోడి పోయి—అప్రయత్నంగా ఉయ్యూరు టికెట్ తీయించింది. ఆయన కృతజ్ఞత చెప్పబోతూంటే "ఫరవాలేదులెండి" అన్నా.

"ఇంటి దగ్గర అదొక్కత్తే పిల్లల్తో అవస్థ పడుతూవుంటుంది. పైగా జబ్బుమనిషి"...



బస్‌లో వెళ్ళి కూర్చున్నా. ప్రపంచం అభ్యుదయం వైపు యెంతో వేగంగా పరిభ్రమిస్తోంది. ఇటు వ్యక్తి కూడా యెన్నో జటిల సమస్యల్ని ఛేదించుకుంటూ బ్రతుకుతో హర్డిల్స్ ఆడవలసివస్తున్న రోజులివి. మనిషి కోసం యెన్నో సదుపాయాల్ని ప్రభుత్వం, జాతీయత అనే సముద్రం నుంచి మధించి తీస్తుంటే—మరో ప్రక్క మనిషిని వ్యక్తిపరమైన యిబ్బందులు చేదువైపు గెంటుకు పోతున్నాయి. సుఖాన్ని, దుఃఖాన్ని, ఆడంబరాల్ని, అవకాశాల్ని, పట్టుకున్న మనిషికి శాంతికూడా అశాంతే కలగజేస్తోంది.

"ఈబస్‌లు వెంటనే బయలుదేరవు. ఈపాటికి పెళ్ళి కాస్తా అయిపోయివుంటుంది..."

"అన్నీ యింతేనండీ... రైళ్ళు మాత్రం వేళకొచ్చాయా... మొన్న మెయిల్ ఆరుగంటులు లేటు. దాంతో నా కారువేలు నష్టంవచ్చింది..."

"పైగా ప్రాణాలకి భరోసా యేడ్చిందా అంటు"...

పైకి నవ్వు తెప్పించినా, ఆమాటలు నన్ను ఆలోచనల వలలోకి లాగాయి... ఉదయం యింటిదగ్గర కన్పించకపోతే నాన్న యీపాటికి శివతాండవం చేస్తుంటాడు. అలనాటి పార్వతీదేవి అంశ అమ్మలోవున్నా—భర్తలోలేని మూడోకన్ను, ఆయన నోరే అని నిర్ధారణ చేసుకుని, తాత్కాలిక రక్షణ శిబిరంగా వంటింటినే చూసుకుంటుంది ఆవిడ. ఇక ఆయన్ని శాంతింప చేసే ప్రమథగణాలు—పక్కింటి రామచంద్రంగారు, "వూరుకో నాయనా" అని చమత్కారంగా మండలించే దొడ్లో వాటా బామ్మగారు, "మామయ్యా" అంటూ ఆయనలోంచి పుట్టే అగ్నిని—నిప్పుతోనే అటకాయించాలని చుట్టు అందించే సీత.

ఆరేళ్ళు హైస్కూల్లో, ఆపైన నాలుగేళ్ళు కాలేజీలో చదువుకున్నందుకు గుర్తుగా తనకో డిగ్రీ వుందని, తాననుకుంటే "మొత్తం నీ చదువు తూకం మూడెకరాలు" అంటాడు నాన్న.

"చదువుకుని నామాట వినకుండా పోయావురా" అంటుంది అమ్మ.

"వోయ్ శంకరంబావా! నీ మెదడు బి.ఏ., ప్యాసయ్యింది. దానిమార్కెట్ ధర నెలకు నూరు రూపాయలు మాత్రం. అప్పుడప్పుడు అపనిందలూ, అవమానాలూ అందుకుంటూ వుండాలి. నువ్వు పోగొట్టుకునేది వ్యక్తి స్వాతంత్ర్యం. పొందేది భావదాస్యం."

"పెళ్ళిచేసుకో... వుద్యోగంరాక పోదు." చిన్నాన్న సలహా...

చిన్నతనం, ఆతరువాత చదువు, ఆపైన వుద్యోగం, వాటి బాధ్యతలు,

శ్రీ సుభా

వీటిమధ్య వివాహం, భార్య, ఫుక్కిరి బిక్కిరి చేసే ఆనందపు జల్లు, ఉండుండి అలకల గాలివానలు, ఆ పైన పిల్లలు, తిరిగి వాళ్ళ పెంపకం, చదివించడం, సంఘంలో మారడానికి నడుంకు వ్యక్తిత్వం గడకర్రనూ ఆశయాల తాళ్ళతో బిగించి వాళ్ళనిసంఘంలోకి వదలడం, అప్పుడప్పుడు ఆశయాల త్రాళ్ళు ముళ్ళు సడలించుకుంటాయి. వ్యక్తిత్వం పటుత్వం తగ్గి వెన్నెముకలో ఐక్యం అయిపోతూవుంటుంది.

"చూడబ్బాయి!"... చూశాను.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" ప్రక్కన కూర్చున్న పెద్దమనిషి అడిగాడు.

ఎలా చెప్పాలో తెలియక "ఆచరించలేనిది, అందుకోలేనిది"అన్నాను.

ఆయన నవ్వేశాడు. "నిజమే చెప్పావు. చెయ్యలేనివీ, చేతకానివే ఆలోచనలోకి వస్తాయిట."

ఇంతలో వుయ్యూరులో ఆగింది బస్. దిగేవాళ్ళు దిగుతున్నారు. కండక్టర్‌కూడా దిగి ప్రక్కనున్న కాఫీ హోటల్లోకి వెళ్ళాడు.

"చూడు నాయనా... ఇదిగో టికెట్ డబ్బు" క్రింద నిలబడి కిటికీగుండా అందిస్తున్నాడు, ఇందాకటి వ్యక్తి.

"అక్కరలేదు... వుంచండి" అనాలనిపించింది. కానీ అవతల మనిషి నొచ్చుకుంటారేమో నన్న మొహమాటంచేత మారుమాట్లాడకుండా తీసుకున్నాను.

"సమయానికి సహాయం చేశావు. వస్తానాయనా" అంటున్నారు, వెళ్ళిపోతూ.

ఆయనవైపే చూస్తున్నాను. ఎక్కడో చూశానీ మనిషిని. అందుకే "చూడండి మేష్టారూ" అన్నా ఆత్రుతగా. అంతే. ఆయన నావైపు తిరగడం, నా జ్ఞాపకశక్తి అలసటని పోగొట్టుకుని విజయగర్వంచేతకళ్ళద్వారా ఆనందించడం అన్నీ జరిగాయి.

"సీతారామయ్య మేష్టారూ" అన్నా, నాకు తెలియకుండానే బస్ దిగాను.

"ఇందాకటినుంచీ మిమ్మల్ని గుర్తుపట్టలేకపోయాను మేష్టారూ! మీ పేరు సీతారామయ్యగారు కదూ..."

"ఔన్నాయనా..."

"నేను గుర్తున్నానండి... శంకర్రావుని..." ఆయన గుర్తుచేసుకుంటున్నారు.

బడిపంతుళ్ళకు మరీ బాగా చదివేవాళ్ళూ, లేకపోతే పిచ్చగా అల్లరి చేసేవాళ్ళూతప్ప గుర్తుండరన్న లోకోక్తి నిజమేనేమో... ఆ లెక్కనయితే నాది చిన్నప్పటినుంచీ నాయనమ్మ అన్నట్టు అత్తెసరు చదువే. ప్రతీ పేపర్లో నూటికి డభ్భై మార్కులు తెచ్చుకునే రమణ నాకు వింతగా కన్పించేవాడు. అలాగే రెండు జేబులనిండా జీళ్ళు పోసుకుని తింటూ ఆ పైన పక్కవాడి కంపాస్‌బాక్స్‌లో పెన్సిల్స్ అవీ దొంగిలించే సదానందం ఆశ్చర్యంగా ఉండేవాడు. రమణంత బాగా చదవడం, లేక సదానందంలా అల్లరి చెయ్యగల్గడం యీనాటికీ నాకు తీరనికోరికలే. ఆ లెక్కన సీతారామయ్యగారికి నేను గుర్తులేకపోవడంలో అన్యాయంలేదు.

"మాకు హిష్టరీ, ఇంగ్లీషు చెప్పేవారు."

"వూహూ" అంటున్నారాయన.

"ఓ సారి నేను బొంబాయిఎక్కడో గుర్తుపెట్టమంటే మద్రాసుదగ్గర నోట్ చేశానని, పేకబెత్తం..." ఆగాను.

"గుర్తొస్తోందోయ్ యిప్పుడు..." వార్ధక్యానికి విరుగుడయిన కళ్ళజోడులోంచి కళ్ళు మెరుస్తున్నాయి...

"ఇప్పుడేం చేస్తున్నావు? ఉండటం యెక్కడ?"

"చిన్న వుద్యోగం అండీ... ఏదో బ్యాంక్‌లో... ..."

"మీవాళ్ళంతా బావున్నారా? పెద్దవాడి వయిపోయావు. అప్పుడప్పుడు నీలాగే పలకరిస్తూవుంటారు, కొందరు. చాలా బావుందినాయనా."

"ఈ దేశంలో మేష్టరి ఉద్యోగానికి పరపతి లేదురా" అంటాడు కాశీపతి, కాలేజీ లెక్చరర్‌గా నాలుగేళ్ళ అనుభవంతో. నే నొప్పుకోను దానికి. ఆత్మతృప్తిని—అదీ ఉద్యోగంద్వారా పొందగల్గేది ఒక్క ఉపాధ్యాయుడే—ఈ దేశంలో.

"ఎంతవరకూ ప్రయాణం?"

"బందరండి."

ఇంతలో కండక్టర్ "రండి, రండి" కేకలు మొదలు పెట్టాడు.

"ఎలాగూ బస్ దిగావు. మా యింటికి వచ్చి వెళ్ళవోయ్... నిన్ను చూస్తుంటే..." ఆగిపోయారాయన.

ఆయన మాట కాదనాలనిపించలేదు. కానీ, నేను వెళ్ళాల్సిన అవసరం గుర్తొచ్చి అన్నాను. "మరి నన్ను నాలుగుగంటలకు వదిలెయ్యాలి మేష్టారూ" అని.

ఇద్దరం పోష్టాఫీసు రోడ్డుగుండా వెడుతున్నాం. మేష్టారబ్బాయి రాజశేఖరం గుర్తుకొచ్చాడు. అతను మా కన్నా ఓ క్లాసు ఎక్కువ చదువుతూ వుండేవాడు. అదే అడిగాను. ఆయన చటుక్కున నా వైపు చూసి "వాడు" అని ఆగిపోయారు.

ఇంతలో వీధిలో ఆడుకుంటున్న పసివాళ్ళలోంచి ఇద్దరు "తాతయ్యా" అంటూ వచ్చి ఆయన్ని చుట్టుముట్టారు. ఆయన మరీ చిన్నవాణ్ణి యెత్తుకుని, రెండోవాడు పంచెపట్టుకుని వేళ్ళాడుతూంటే "రావోయ్, ఇదే యిల్లు" అన్నారు.

పిల్లలతో ఆయన లోపలికి వెళ్ళారు. చాలా సాదాగా ఏ దర్పంలేని వ్యక్తి చూపులా వుంది యింటి వాతావరణం. పాతకాలంనాటి మంచం. అవే కుర్చీలు. అద్దాలు పగిలిపోతే బీటులోంచి మాసిపోయి నవ్వే బంధువుల, దేవుళ్ళ ఫొటోలు. మేకున అద్దం... పక్కన గోడకు కాటుక మరకలు. నవ్వొచ్చింది. మేష్టారు మేష్టారేగాని మినిష్టర్ కారుగా. అసాధారణంగా మేష్టారు బ్రతుకు వెళ్ళమార్చలేరని నాకు తెలిసిందే. ఐతే సాధారణం

కూడా బాధకల్గించేదే అయినప్పుడు పైదాన్నే మనిషి వాంఛిస్తాడేమో... లేకపోతే ఆ యింటిని యింకా లోతుగా పరీక్షించడం జరగకపోను. అలాగే కూర్చున్నా.

"కాఫీ తాగు బాబూ!"

"ఎందుకండీ ఇదంతా చాదస్తం..."

"అదేమిటి నాయనా! మా అబ్బాయిలాంటివాడివే..."

"ఏమండీ... ఎవరూ వస్తా?" లోపలి నుంచి చిన్న పిలుపు వినిపించింది.

"మన శిష్యుడే... శంకర్రావు..."

"అలాగా... అమ్మాయేమో అనుకున్నాను."

ఆవిడ లేచివచ్చింది నెమ్మదిగా

"నువ్వెందుకు లేస్తావు? ప్రకాశాన్ని పిలవకూడదూ?"

"ఎంతసేపని ఆ గదిలో పేగ్గిపొమ్మంటారు?"

వచ్చిన రాజేశ్వరమ్మగార్ని చూసి "నమస్కారమండి!" అనగలిగాను. మనిషిలో నాకు తెలిసిన పోలికలు చాలామటుకు లేనే లేవు. నాకు కొత్తగా, ఆపైన భయంగాకన్పించినవి పీక్కుపోయిన, కొండెక్కిపోతున్న దీపాల్లాంటి కళ్ళు... ...బోసి మెడమీద పసుపురంగు మిగుల్చుకుని ఆకర్షించే పుస్తెలతాడు... ప్రాణం అన్నది శరీరంలోని అన్ని అవయవాలలోనూ కాకుండా యెక్కడో ఒకచోకు, అదీ నామమాత్రంగా వేళ్ళాడుతోన్నట్టున్న ఆకారం. "అచ్చు అబ్బాయిలా వున్నాడండీ" అంటోంది నోరు. ఆ భార్యాభర్తల చూపులు కలుసుకున్నాయి... ఆవి దేమనుకుందో లోపలికి వెళ్ళిపోయింది. దిష్టిబొమ్మ నడుస్తోన్నట్టుగా వుంది... ఏ చప్పుడూ లేదు.

"ఇదీ నాయనా, మీ మేష్టారికి మిగిలింది."

"ఆవిడకేమిటండీ జబ్బు?..."

"భగవంతుడు చేసిన అన్యాయం దాని నడుం విరగ్గొట్టింది మనిషిగా ఏం చెయ్యలేని నేను దాన్ని రోగిష్టిదానిగా మార్చేశాను... ఆ రెండిటితో మంచాన పడింది."

"అదేమిటి మాష్టారూ! మరి రాజశేఖరం..."

ఆయన నెమ్మదిగా అన్నాడు... "వాడు పోయాడు నాయనా... వాడుంటే మాకీగతి పట్టకపోను..."

"అరే" అన్నాను నొచ్చుకుంటూ.

"నాలా కాకుండా పైకొస్తాడని దాని నగానట్రా అమ్మి చదువు చెప్పించాం. అలాగే చదువొచ్చింది. ఈ లోపునే సరదాపడి పెళ్ళిచేశాం. ఇద్దరు నలుసులుకూడా బయలుదేరారు. కాని మా దురదృష్టం—యేడాది క్రితం భగవంతుడు వాణ్ణి మా క్కాకుండా చేశాడు..."

"చాలా అన్యాయం జరిగిందండీ"

"ఆఖరికి జబ్బువాతపడ్డఅదీ, భర్త పోయిన కోడలూ, అప్పులతో మిగిలిన యీయిల్లు... యేదో క్రిందా మీదాపడి బ్రతుకుతున్నాం..."

"మరి... ..."

"అవున్నాయనా... యింకా పెళ్ళికి పార్వతి మిగిలేవుంది. దానంత



టుదే చదివి మెట్రిక్ ప్యాసయ్యింది. ఇంటికోసం వుద్యోగం చేస్తానంటుంది— అది. పెళ్ళిచెయ్యమంటుంది వాళ్ళమ్మ. కాదు, అడబ్బుతో అమ్మను విశాఖపట్టణం తీసుకు వెడదామంటుంది, పార్వతి. ఏం చెయ్యాలో ఏమనాలో తెలియక మౌనం వహిస్తాను నేను...'

నే నెరిగిన సీతారామయ్యగారు జవసత్వాలు కలిగినమనిషి. వెనక రెండెకరాల పొలం కలిగిన దిట్ట. ఇద్దరు కూతుళ్ళకు ఐదు రోజుల పెళ్ళిళ్ళు చేసిన మధ్య తరగతి కుటుంబీకుడు. క్లాసులో గంభీర కంఠంతో శ్రీకృష్ణదేవరాయలు కొండవీడుని యెలా ముట్టడించిందీ చెబుతూంటే మా వళ్ళు గగుర్పొడిచేది. ఇంటికొచ్చి ఆ కంఠాన్ని అనుకరిస్తూ ఆడుకునేవాళ్ళం. అటువంటిది పదేళ్ళు తిరిగేసరికి కాలం ఆయన బ్రతుకుని విధి పేరిట ముట్టడిచేస్తే— పతనమయిన సామ్రాజ్యపు ప్రాకారంలా, క్రీనీడలావున్న ఆయన్ని చూడలేకపోతున్నాను.

'భగవంతుడు తను తయారు చేసిన మనిషితో దొంగాటలాడుతాడు. భయపెడతాడు. ఒక్కొక్కసారి గిలిగింతలు పెడతాడు. ఆఖరికి తిరిగి తనలోకి తీసుకుంటాడు. ఆయనకు చేతకానిదిలేదు ...ఏపని చేసినా ఆయనకే చెల్లింది.' తాతయ్య వేదాంత ధోరణి గుర్తొచ్చింది. కోపం కూడా వచ్చింది.

'బాధపడకండి మేష్టారూ! మిమ్మల్నెలా వోదార్చాలో నాకు తెలియడంలేదు. చెప్పాలంటే భగవంతుడి మీద మీకు నమ్మకం వుందో లేదో తెలియదుగాని— మీ కుటుంబానికి చేసిన అన్యాయం చూస్తూంటే, నమ్మకం లేకపోవడమే మంచిదనిపిస్తోంది...'

ఆయన నవ్వాడు— చీకటిలా.

'లేదు నాయనా, అలా అనకూడదు...ఏం చేసినా ఆయనకే చెల్లింది...మనుష్యులు సంతోషాన్ని భరించగలరు గానీ దుఃఖాన్ని సహించలేరు. సంతోషం అనేది లోతైన నీటిలో యీతరాక గంతులువేయడం లాంటిది. ఆసమయంలో మనిషికి తను బ్రతకాలన్న ధ్యాస తప్పించి— యెలా బ్రతికి బయట పడడమో తెలియదు. అందుకే సంతోషంలో మనిషితనపరిసరాలనుమరిచిపోతాడు. ఆఖరికి భగవంతుణ్ణికూడా— దుఃఖం అలాంటిదికాదు. నిండానీటిలోతన్ని తను రక్షించుకోగల నేర్పువుండీ పదిమందిని రక్షించాలన్న ఆవేదన, హృదయపు ఆరాటం లాంటిది. అందుకే మనిషి అటూ యిటూ, క్రిందామీదాపడతాడు ...అంతా తెలుస్తూనే వుంటుంది...అదో చేదైన అనుభవం అయినా, వైశాల్యాన్ని, విజ్ఞతను పెంచుతుంది.'

నాకేమనాలో తెలియలేదు... వింటూనే వున్నాను. ఇంతలో స్కూలు నుంచీ నాన్నా అంటూ వో చిన్నమ్మాయి వచ్చింది...

'నేను వెడతానండీ' అన్నాను.



'మంచిది నాయనా... చాలాకాలం తరువాత కన్పించావు... యిటువేపు వెడుతుంటే అప్పుడప్పుడు కన్పిస్తూవుండు.'

'తాతయ్యా! పార్వతత్తయొచ్చింది.' అంటూ ప్రకాశం వీధిలోంచి పరుగెత్తుకువచ్చాడు... బయట రిక్షా ఆగిన చప్పుడు విన్పిస్తోంది...

ఎడం భుజంమీది పమిటని కుడి భుజంమీదికి లాక్కుంటూ, చిన్న సైజుసంచి వొకచేత్తో పట్టుకుని, రెండోచేత్తో జుట్టు సవరించుకుంటూ లోపలికి వస్తున్న అమ్మాయి 'నాన్నా' అంటూ సీతారామయ్యగార్ని చూసి ఆ పైన నా వైపు చూసి కంగారుగా లోపలకు వెళ్ళిపోవడం జరిగింది.

• • •

పార్వతి సీతారామయ్యగారి కూతురవడం నేను వూహించనిది. పార్వతి మా మేష్టారమ్మాయిఅయితే ఆయన చెప్పిన మాటలబట్టి డీలాపడ్డ తండ్రిని ఉద్యోగంచేస్తూ ఆదుకోవాలన్న ఆ అమ్మాయి నిర్ణయానికి ఎంతో సంబరపడతాను. అన్నగారు పోయి తమ యింట్లో రోజులు వెళ్ళదీస్తున్న రాజశేఖరం భార్యా, పిల్లల్ని అభిమానంగా చూస్తూ, మంచానపడ్డ తల్లికి సేవలు చేస్తున్న కూతురుగా ఆ స్త్రీని నేను గౌరవిస్తాను.

కానీ, యీ నా అభిప్రాయాల వల్ల పార్వతికి ఏ మేలూ జరగదని, నా ఉద్దేశాలు తెలిసి పార్వతి నాకు కృతజ్ఞత తెల్పే అవకాశం కలగదనీ తెలుసు.

కష్టాలు యీడ్చి కొడుతూంటే పెళ్ళి యెలా చెయ్యగలనా అనే మీమాంసతో, ఆలోచనలతో తూట్లు పడిపోతున్న తండ్రితో తన కిప్పట్లో పెళ్ళి వద్దన్న పార్వతి మాటలవెనుక చేదునిర్ణయానికి జాలిచూపే పరిస్థితిలో నేను లేను. అందగత్తె కాకపోగా, కనీసం డబ్బు సమకూర్చే అలంకారాలు లేక, అతి మామూలుగా పెళ్ళికూతురుగా పార్వతిని చాలా మంది యువకులు యేవిధంగా విలువ కడతారో నేను వూహించనవసరం లేదు.

పదిరోజులనాడు అమ్మ వేడికోలు— సీత బలవంతం— ఇన్నిటినీ కాదనలేక నేను విజయవాడలో పెళ్ళిచూపులు తప్పించుకోలేకపోయాను. చిన్నాన్న చుట్టంచూపుగా విజయవాడ వెళ్ళిన నన్ను, అమ్మను బలవంతం పెట్టాడు.

'నన్నే పెళ్ళాడని ఆ అమ్మాయి, నిన్నేం బలవంతం పెట్టదు సరా?' అన్నాడు చిన్నాన్న.

'ఇంతకీ యెవరయ్యా మరిదీ?'

'మనవాళ్ళే, మనశాఖే. పైవాళ్ళ పిల్లని మీవాడు చేసుకుంటానన్నా, యెలాగూ నువ్వూ అన్నయ్యా పడనిచ్చేది లేదుగా... వెంకట్రావుగారి అన్నగారి కూతురు. ఆయనగారికేం లెదుట. వీళ్ళు యేదో తంటాలుపడుతున్నారు... ...'

'అలాగా!'

'కట్నంగురించి ఆశ పెట్టుకోకండి మరి.'

"అయ్యో బాగానేవుంది... ఇవన్నీ మీ అన్నయ్యవుంటే తేలేవిగా..."

"చూడమ్మా ఒదినా... నలభైయేళ్ళ కాపురంలో ఒక్కవిషయంలోనూ, అన్నయ్యమాట నువ్వు కాదనలేదు. కనీసం శంకరం యేఒక్కవిషయంలోనయినా మీ యిద్దర్నీ కాదంటే నాకు చూడాలని వుంది."

"వాడిని పాడుచెయ్యి నువ్వు." అమ్మ నవ్వుతోంది.

"మనిషికి స్వంతంగా ఆలోచించే అవకాశం యివ్వడం నా ఉద్దేశం..."

ఆ మధ్యాహ్నం నేనూ, అమ్మా, సీతా వెళ్ళి పెళ్ళికూతుర్ని చూడ్డం జరిగింది... ...

అతి సాధారణంగా కూర్చుని, కళ్ళెత్తి నా వైపు చూసింది. ఓ భయంకరమైన దుస్వప్నాన్ని చూస్తోన్నట్టు, భవిష్యత్‌లో రానున్న మహా ప్రళయాన్ని వూహించి విలవిల్లాడుతోన్నట్టుగా వుంది ఆ చూపు. అందమైన వాటిని, నచ్చినవాటిని చూస్తే కళ్ళల్లో సంతోషం రగుల్తుందంటారు ఎందుకా అమ్మాయి నన్నుచూసి భయపడిందో నాకా రోజు అర్థంకాలేదు.

కానీ, యీ రోజు నాకర్థం అయ్యింది. ఆ అమ్మాయి సీతారామయ్యగారికూతురు పార్వతి. అందుకే నన్నుచూసి భయపడింది. అప్పులతో అంతంతమాత్రంగావున్న పెంకుటిల్లు తన పెళ్ళిపేర పరులపరం అయితే, అస్వస్థతగావున్న తల్లి మందులేక మరింత మాగిపోతే, పెళ్ళిఖర్చు తండ్రిని వీధిలోనిలబెట్టి వేలంవేస్తే, బొందులాగు తమ్ముడూ, చిరుగుపరికిణీ చెల్లెళ్ళ అర్ధాకలి కడుపులో ఆంతర్యం విచ్చుకునిరంకెలువేస్తూంటే ఓ మొగవాడిని వశీకరించు నే మాయలు, మంత్రాలు తనవద్ద లేవని తెలిసి నల్లబడింది. అందంగాలేని, ఆనందం యెరగని మధ్యతరగతి మట్టిబొమ్మకు అత్యాశ అనే రంగులు పులుముకుంటే, పగిలినతరువాతైనా పదిమందీ ఆక్షేపిస్తారన్న నిజం తెలిసిన మనిషి కావడంవల్ల నిరాశ దాచుకోలేకపోయివుంటుంది."

"కట్నం యివ్వలేరుట వాళ్ళు" అమ్మ నాన్నతో చెప్పింది.

"వీడే దొరికాడా తేరగా..."

"అమ్మాయి యెలావుంది."

"అంతంతమాత్రంగానేవుంది" సీత అంటోంది...

"మరి వీడేమంటాడు..."

నేను యేమీ అనలేనని—అనకూడదనీ నాన్న వుద్దేశ్యం.

"వెళ్ళగానే ఏసంగతీ జవాబు వ్రాయమన్నారు మీ తమ్ముడుగారు."

"వాడొకడు... దేశోద్ధారకుడు బయలుదేరాడు. సీతా, పిల్లనచ్చలేదనీ కట్నం కావాలనీ రాసిపడెయ్"...

"బావకు నచ్చిందేమో" అని నాన్నతో అని, నా దగ్గరకు వచ్చి,

"నీకుగాని నచ్చితే చెప్పమంటున్నాడు, మావయ్య" అంది సీత.

"నాకు పార్వతి నచ్చిందా నచ్చ





లేదా? పార్వతి భయంగా నా వైపు చూస్తున్న దృశ్యం కన్పించింది, తిరిగి... ...

ప్రయాణంపొడుగునా జ్ఞాపకాలు నాతోపాటు తరుముకు వస్తున్నాయి. నన్నుచూసిన పార్వతి యేమనుకుంటుంది? తండ్రితో యేం చెప్పివుంటుంది? దానికి ఆయన అలసిన గుండె యిచ్చిన తీర్పేమిటి? ఆలోచిస్తూంటే తలపోటు రాసాగింది... అయినా వాటినుంచి తప్పించుకోలేకపోయాను. ఊహలు వూడలై మెదడులో నాటుకుంటున్నాయి...

● ● ●

"వాళ్ళకు యిది నచ్చిందంటారా" రాజేశ్వరమ్మగారు భర్తని అడుగుతోంది.

వాళ్ళకు కట్నం కావాలేమో యీయిల్లు అమ్మిచేసేస్తాను పార్వతి పెళ్ళి... అదైనా సుఖపడితేచాలు"...

అంతకుముందే అక్కడకు వచ్చిన పార్వతి కంగారుగా అంటోంది. కంఠం అంతా కన్నీటితో తడిసింది... మాటలచుట్టూ భయంకరమైన భవిష్యత్ అడ్డు తగులుతోంది.

"వద్దు నాన్నా వద్దు. ఈయిల్లు అమ్మొద్దు"...

అదేమిటే, ఆసంబంధం మంచిదని పిన్ని వ్రాసింది... వాళ్ళది బందరేటగా"

"నీకు తెలియదమ్మా...—వాళ్ళకి నేను నచ్చలేదు. ... మన బీదతనం అసలేనచ్చదు."

"నువ్వూరుకో....మీరు వెళ్ళిరండి వోసారి బందరు."

"నాన్నా... అతనికిచ్చి నన్ను పెళ్ళి చెయ్యొద్దు. వాళ్ళు నేను నచ్చలేదని వ్రాశారుట. మీరు బాధపడతారని పిన్ని అలా రాసివుంటుంది. నిన్నొచ్చాడు. అతనేనాన్నా నన్ను చూసిన అబ్బాయి..."

పార్వతి పరుగునదొడ్లోచీకటిలోకి పారిపోయింది. పార్వతిని చూడలేక చంద్రుడు మేఘాల్లో దాక్కున్నాడు. నూతిగట్టుకు తలపెట్టుకుని చుట్టూ నిశ్శబ్దాన్ని భంగంచెయ్యలేక చిన్నగా యేడుస్తున్న పార్వతినిచూసి నల్లకాకి చీకట్లో తెల్లబోయి—ఆపైన. అరుస్తూ పారిపోయింది. వేపచెట్టు వోదార్పుగా చేదుగాలి వరంగా వదిలింది. నూతిలోపల అట్టడుగు నీళ్ళలో కప్ప యేం చెయ్యలేక తలెత్తి లోపలకు వెళ్ళిపోయింది ... ... ...

● ● ●

అంతవరకూ ఆలోచించాను. ... యింకా... యింకా... ఆరాత్రి నా తలలో వెయ్యి యేనుగులు పరుగులు పెట్టాయి. వాటి పాదాలక్రింద సీతారామయ్య మేష్టారు, ఎముకలగూడు రాజేశ్వరమ్మగారు, చెదిరిన మబ్బు తునకలాంటి పార్వతి, విరిగిన పాలలాంటి పసివాళ్ళు దుమ్ములో అణువులవుతున్నారు.

లేచి వెంటనే వుత్తరం వ్రాశాను. ఆ తరువాత సీతతో మాట్లాడాను. మొదట వింతగావిన్న సీత, ఆపైన అనునయంగా తలూపి, సానుభూతిగా చూసి వంటింట్లోకి వెళ్ళింది. అత్తయ్యని పిల్చింది. మొదట అనుమానపడి, ఆ తరువాత ఆనందపడి,

ఆ రెంటిని మించిన భయం పుట్టుకువస్తే వణికిపోయి సీతను ఆసరాగా చేసుకుని భర్తగదిలోకి వెళ్ళింది. ఆ గదిలో పెద్ద ప్రళయం రేగింది. గాలి వానగామారింది. ఆతరువాత హోరు సన్నగిల్లింది. వర్షం కుండపోతనుంచి, చినుకులుగా మారి మాయమైంది.

సీతారామయ్యగారి జవాబుకోసం యెదురు చూస్తున్నాను. ఈ లోపున ఆశ, ఆత్రుత, ఆపైన ఆవేదన, మళ్ళీ ఆలోచన. ఆ నాడు అంత చీకటిలోనూ బస్‌స్టాండ్‌కు వెళ్ళి "విజయవాడ వెళ్ళే బస్ ఉందా" అని అడిగాను.

"ఓ క్షణంక్రితమే వెళ్ళిపోయింది" అన్నా రెవరో.

● ● ●

తెల్లవారినతరువాత ఒక ఉత్తరం అందుకున్నాను.

"శంకరానికి ఆశీస్సులు.

నీ ఉత్తరం అందింది. పార్వతిని పెళ్ళి చేసుకుంటాననీ, అందుకు మీ వాళ్ళు వొప్పుకున్నారనీ వ్రాశావు. మొదట నేను ఆనందంతో ఉక్కిరిబిక్కి రయ్యాను. కానీ, రిటైర్డ్ బడిపంతులుగా నేను నీకేం యివ్వగలను చెప్పు.

ఇక పార్వతి గురించి. అది తన నీడనిచూసి భయపడే ఆడపిల్ల. బ్రతుకు దాన్నావిధంగా పెంచింది. మరీ డబ్బున్నవాళన్నా, మరీ త్యాగాలు చేసేవాళ్ళన్నా అది వొణికిపోతుంది.

నిన్న మా యింట్లో చూసిన్నాడే మీవాళ్ళను బలవంతంగా ఒప్పించి యిలాంటి తెగింపుపని చేస్తావని దానికి తెలుసేమో! నీ పేరెత్తితే పారిపోయింది.

"మన సుఖంపేర పార్వతి పెళ్ళి వెనకపడిపోతోంద"ని వాళ్ళమ్మకన్నీరు పెట్టుకుంది. అవతలగదిలో తను పెళ్ళిచేసుకుంటే అంతంతమాత్రంగా వున్న మమ్మల్నీ, ఇంటినీ అన్యాయం చెయ్యడం అవుతుందని పార్వతి విచారపడుతోన్నట్టుగావుంది. దాన్నీ, ఆఖరికి నన్ను నేనూ సముదాయించుకోలేని యీ వాతావరణం చూస్తే నా గుండె విలవిల్లాడుతోంది... ... దానికి వుద్యోగంకూడా దొరికింది. పార్వతి అంటుంది! "నేను త్యాగం చెయ్యడంలేదు నాన్నా. నా ఆశయం తీర్చుకుంటున్నానంతే" అని ...

నా వుత్తరం నీకు బాధ కల్గిస్తుందేమో. ఆఖరి మాటగా ఒకటి వ్రాయాలని వుంది... నిన్ను త్యాగానికి వుసి కొల్పేటట్టు చేసి నిద్ర లేపిన నీ వ్యక్తిత్వం మీద నాకు నమ్మకంవుంది. చుట్టూ మా పార్వతిలాంటి వాళ్ళకు కొదవలేదు. అందులో యే వొక్క పార్వతికి నువ్వు భర్త అయినా నేను ఆనందిస్తాను. అప్పుడు పార్వతి కన్నీటికి కూడా విలువ కట్టిన వాడివవుతావు ...

పరిస్థితులు మనిషిని వెనక్కు నెడుతుంటే ఆశయాలు మరింత బలవత్తరమవ్వాలి. నీవిషయంలో అది నిజం కావాలని కోరుకుంటున్నాను.

సీతారామయ్య"

□□□





## "జ్యోతి"ష్యము :

# మా(మూ, మో)స ఫలితాలు

**మేషం :**

మీరామనసులో మీరేదో తల పోస్తున్నారు. అది జరగాలంటే మీరు గట్టి ప్రయత్నాలు చెయ్యడం ముఖ్యం. అది నెరవేరాలని భగవంతుని ప్రార్థించడం కూడా (నమ్మకం వుంటేనే) అవసరం. ఈమాసం పిల్లలకు అనారోగ్యం కలిగే సూచనలు కనిపిస్తున్నాయి. (పిల్లలు లేనివారికి ఇది వర్తించదు) ముందే జాగ్రత్తలు తీసుకోవటం అవసరం. మీ మామూలు ఆదాయం మామూలుగానే వుంటుంది. నెలాఖరు ప్రాంతాల ప్రయాణ సూచనలు కనిపిస్తున్నాయి. (క్యాంప్ ఏదేనా వుందా?) ప్రయాణాల్లో చాలా జాగ్రత్తగా మెలగటం అవసరం.

**వృషభం :**

ఈ మాసంలో మీపై అధికారుల గౌరవం పొందగలుగుతారు. (బకాయి పనేవేనా వుంటే తొందరగా ముగించేయండి. లేదా, రాజమండ్రి నుంచి వచ్చాయని నాలుగు జామకాయలు తీసుకెళ్ళి వారికివ్వండి) మీ విరోధులు కొందరు మీకు అన్యాయం చెయ్యాలనిచూస్తున్నారు. (సహజమేగదా) జాగ్రత్తగా మెలగండి. నెలాఖరుకు డబ్బుకు ఇబ్బంది కలగవచ్చును. (మీరు మామూలు ఉద్యోగి ఐతే విధిగా కలుగుతుంది) మాసం మధ్యలో ప్రయాణం చెయ్యవలసి వుంటుంది. (సంక్రాంతి పండగకు అత్తవారింటికి వెళ్ళాలనుకొంటున్న కొత్త అల్లుళ్ళకు మాత్రమే) పండగ రోజుల్లో విందులు, వినోదాలు.

**మిథునం :**

ఈ మాసం మీ ఉద్యోగంలో పెద్ద మార్పేమీ ఉండదు. (అది దేవుడు చెప్పినమాట) మీదగ్గర డబ్బున్నదని పసిగట్టి, మీ మిత్రులే అది కొల్లగొట్టాలనుకొంటారు. (మరేం లేదు, ఆఫీసువేళలో మీజేబులో రూపాయి వుంటే మీమిత్రులు కాఫీ తాగుదాం పదమని బలవంతంచేయవచ్చు) పిల్లల ఆరోగ్యం బాగుంటుంది. (వాళ్ళకు బాగా పళ్ళూపాలూ చాక్లెట్లూఇస్తే) విద్యార్థులకు, యువకులకు,తీరికలేని మాసం. (పండుగరోజుల్లో అమ్మాయిలు ముస్తాబై వీధుల్లో తిరుగుతూ వుంటారు) గత 64 వ సంవత్సరం కంటె, ఈ కొత్త సంవత్సరం మీకు బాగుంటుంది. (ఎట్లాగూ మీరూ అలాగే అనుకుంటారుగా)